క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: ఉప్పల చారిటబుల్ ట్రస్టు సహాయంతో ఏర్పాటు చేసిన ఆర్మీ అకాడమీ ఫిజికల్ ట్రైనింగ్ హైదరాబాద్ అకాడమీలో శిక్షణ పొందుతున్న నరేష్ అనే విద్యార్థికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ శిక్షణలో హాస్టల్ ఫీజు నిమిత్తం నెలకు రూ.4000 చొప్పున మెయిన్స్ పరీక్షలు ముగిసేవరకు ఆర్థిక సహాయం చేయనున్నట్లు భరోసా పలికారు. నరేష్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో హాస్టల్ ఫీజు చెల్లించలేక ప్రతిరోజు మథనపడుతున్నాడు. విషయం గమనించిన ఆర్మీ అకాడమీ ఫిజికల్ డైరెక్టర్ నందు.. నరేష్‌ను తీసుకొని జెడ్పీటీసీని కలుసుకున్నారు. స్పందించిన జెడ్పీటీసీ వెంకటేశ్.. నరేష్ హాస్టల్ ఫీజుకయ్యే ఖర్చును ట్రస్టు ద్వారా భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్.. నరేష్‌కు రూ.4000 అందజేశారు.

మంత్రి చొరవతోనే అభివృద్ధి పనులు

పహాడీషరీఫ్: కోట్లాది రూపాయల వ్యయంతో జల్‌పల్లి మున్సిపాలిటీని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభివృద్ధి చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ అఫ్జల్ అన్నారు. వాదే ముస్తఫా బస్తీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 28 వార్డులలో కోట్లాది రూపాయలతో బాక్స్ డ్రైన్, సీసీ, బీటీ రోడ్ల పనులు సాగుతున్నాయన్నారు. అయినా కొంత మంది రాజకీయ విమర్శలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు.

బస్టాప్‌లలో ఆటోలు.. ప్రయాణికులకు పాట్లు



సాగర్‌రోడ్డుపై బస్టాప్‌లో పార్కు చేసిన ఆటో

హస్తినాపురం: నాగార్జునసాగర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న బస్టాపుల్లో ఆటోలను నిలుపుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌రింగ్ రోడ్డు, ఓంకార్‌నగర్, సంతోషిమాతనగర్‌కాలనీ, హస్తినాపురంచౌరస్తా సిగ్నల్, హస్తినాపురం సెంట్రల్‌కాలనీ, బీఎన్‌రెడ్డినగర్ ప్రాంతాలలో ఇష్టానుసారంగా ఆటోలను నిలుపుతున్నారని ట్రాఫిక్ పోలీసులు స్పందించి బస్టాపుల్లో నిలుపుతున్న ఆటోలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కౌన్సెలింగ్‌లోనే పదోన్నతులు కల్పించండి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: తమ సమస్యలు పరిష్కరించాలని వ్యాయామ విద్య ఉపాధ్యాయ రాష్ట్ర సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి సబితారెడ్డిని కలిసి విన్నవించారు. అప్ గ్రేడేషన్ అయిన 1849 పోస్టులకు కామన్ సీనియారిటీ 11, 12 జీవోల ప్రకారం బీపీఈడీ విద్యార్హతలు ఉన్న అందరినీ కలుపుకుని స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయులుగా జరగబోయే పదోన్నతుల కౌన్సిలింగ్‌లోనే పదోన్నతులు కల్పించాలని అభ్యర్థించినట్లు రాఘవరెడ్డి తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో పేటా టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్, టీజీపేటా అధ్యక్షుడు విజయసాగర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, పేటా టీఎస్ గౌరవ అధ్యక్షుడు సోమేశ్వరరావు, నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు జై చంద్రయ్య, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గిఫ్ట్ షాప్ దగ్ధం

హిమాయత్‌నగర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దాదాపు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్టు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. వివరాలు... దోమలగూడలో నివాసం ఉండే లక్ష్మణ్‌లాల్ గత పదేళ్లుగా హిమాయత్‌నగర్ వైజంక్షన్ సమీపంలోని టీవీఎస్ షోరూం వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై గిఫ్ట్ షాప్ నెలకొల్పి సీజనల్ పండుగలకు సంబంధించిన పలు రకాల వస్తువులను విక్రయిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటక దట్టమైన పొగలు వ్యాపించి మంటలు మొదలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే లోపల ఉన్న సుమారు రూ.లక్ష విలువ చేసే వస్తువులు కాలి బూడిదైనట్టు ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మంచాల: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో మన ఊరు–మన బడి పథకం కింద స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.70.92 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులకు, రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, కల్యాణలక్ష్మి, మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబీమా, రైతులకు ఉచిత విద్యుత్, దళిత బంధు పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13.89 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో పాటు నియోజకవర్గంలోని 44 నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. కడ్తాల్ మండలంలో 9 గ్రామ పంచాయతీ భవనాలకు, కల్వకుర్తి మండలంలో 7, వెల్దండకి 7, చారకొండకి 2, ఆమనగల్లుకి 2, తలకొండపల్లికి 8, మాడ్గుల్ మండలంలో 9 గ్రామాల్లో జీపీ భవనాల నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.20 లక్షల చొప్పున నిధులు విడదలయ్యాయన్నారు. మున్సిపాలిటీలో బస్తీ దవాఖానాలు, గ్రామాల్లో పల్లె దవఖానాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాడ్గుల్ మండలానికి 7, తలకొండపల్లి మండలంలో 6, ఆమనగల్లు మున్సిపాలిటీలో 2 బస్తీ, 1 పల్లె దవాఖానా, కడ్తాల్ మండలంలో రావిచేడ్, ముద్విన్, చరికొండ, చల్లంపల్లి గ్రామాలకు 4పల్లె దవాఖానాలు మంజూరు కావడం జరిగిందన్నారు. త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ దక్కాలన్నారు. కార్యకర్తలు, నాయకులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్ భారతమ్మ వితలయ్యగౌడ్, ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, ఉపసర్పంచ్ వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు అధికారులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత..

తలకొండపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన నర్సమ్మకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన రూ.20,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు వెల్జాల్‌లో అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు కోఆర్డినేటర్ నరేందర్‌గౌడ్, జంగయ్య, మల్లేష్‌గౌడ్, రవి, చెన్నకేశవులు, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లండి..

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొనిపోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మంచాల మండల పరిధిలోని కాగజ్‌ఘాట్ గ్రామంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు తీసుకొని రావడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, జిల్లా నాయకుడు కృష్ణగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, ఎంపీపీ కృపేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు: ఎంపీడీఓ

యాచారం: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని మల్కీజ్‌గూడ, మొగుళ్లవంపు గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, డ్రైనేజీ కాల్వలు, తాగునీటి పైపుల లీకేజీలు, నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు చేశారు. పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీ రికార్డుల నమోదులో అలసత్వం వద్దని అన్నారు. ఆమె వెంట స్థానిక నాయకులు, అధికారులు ఉన్నారు.

పల్లె ప్రకృతివనం పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: పల్లె ప్రకృతివనాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని రాయపోల్ సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో పల్లె ప్రకృతి వనం పనులను సర్పంచ్ పరిశీలించారు. గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాయకులు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్న ట్లు ఎంపీపీ నిర్మల మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకాగలరని ఆమె కోరారు.

రాజ్యాధికారంతోనే బతుకులు బాగు

రజకసంఘం రాష్ట్ర ఆర్గనైజర్ కార్యదర్శి శ్రీనివాస్



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: రాజ్యాధికారంతోనే రజకుల బతుకులు బాగుపడతాయని ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో రజకసంఘం మండలాధ్యక్షుడు కల్వకోలు యాదగిరి ఆధ్వర్యంలో గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దశరథం, ఉపాధ్యక్షుడిగా సాయిలు, ప్రధాన కార్యదర్శిగా భిక్షపతి, కోశాధికారిగా చెన్నయ్య, ప్రచార కార్యదర్శిగా శ్రీను, సలహాదారులుగా జంగయ్య, అంజయ్య, వెంకటయ్యతో పాటు మరో 10మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కృష్ణ, మహేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్
- ఇబ్రహీంపట్నంలో నియోజకవర్గ స్థాయి సమావేశం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న తెలంగాణ ఉద్యమకారులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు లెక్కచేయకుండా పోరాటాలు చేశాం. నీళ్లు, నిధులు, నియామకాల కోసం గళమెత్తాం. ఇన్ని పోరాటాలు చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో నేడు అనుకున్న మేర ఫలాలు దక్కటం లేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదిరెడ్డి, వీరేశ్‌కుమార్ విమర్శించారు. ఇబ్రహీంపట్నం డాగ్ బంగ్లాలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ... నాటి ఉద్యమంలో పాల్గొని అన్ని రకాలుగా నష్టపోయాం. అయితే నాడు తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వాళ్లే నేడు అధికారం చెలాయిస్తున్నారు. నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాల్లో 20 శాతం అవకాశాలు కల్పించాలి, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. రైతుబంధు పథకాన్ని 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకే వర్తింపజేసి, మిగితా డబ్బులను ఉద్యమకారుల సంక్షేమ కోసం ఖర్చుచేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకంలో ప్రాధాన్యత కల్పించాలని.. నిరుపేద కుటుంబాలను చెందిన వారికి గ్రామాల్లో ఎకరా వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలన్నారు. రూ.5 వేల పింఛన్‌ను అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటేశంగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, నాయకులు కారింగ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

ఎంపీపీ కొప్పు సుకన్య



యాచారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈజీఎస్ పథకం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. తెలంగాణ రాష్ట్ర సర్కార్ ఆయా పనులకు తామే నిధులు మంజూరు చేసి చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటాన్నారని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ... ఈజీఎస్ పథకం కింద యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 50 పనులకు గాను రూ.2కోట్ల59 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో అవసరమైన కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించాలని ఆమె ప్రజాప్రతినిధులకు సూచించారు. గత మూడేళ్ల కాలంలో రూ.కోట్లాది కేంద్ర నిధులతోనే సీసీ రోడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, చెట్ల పెంపకం తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటి వరకు ఏ గ్రామానికి కూడా పైసా ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. గ్రామాల్లో కేంద్ర నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల విషయమై ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టీఆర్‌ఎస్ సర్కార్ మండల పరిషత్‌లను పూర్తిగా విస్మరించిందని, నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తే తప్ప పంచాయతీలు, మండల పరిషత్‌లో పైసా నిధులు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టండి: ఉప సర్పంచ్

తలకొండపల్లి: వ్యవసాయ పొలాలకు వెళ్లే మట్టిరోడ్ల మరమ్మతులకు నిధులు మంజూర్ చేయాలని దేవునిపడకల్ ఉపసర్పంచ్ రాజమోని తిరుపతి డిమాండ్ చేశారు. దేవునిపడకల్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. గ్రామంలోని వ్యవసాయ పొలాలకు వెళ్లే మట్టి రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు,అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

చైనా మాంజాలు స్వాధీనం



హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత చైనా మాంజాలను విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి మాంజాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ వెల్లడించారు. చైనా మాంజాలతో ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారి మెడకు చుట్టుకుని మరణించడం, గాయపడిన సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయని ఇలాంటి వాటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కంటి వెలుగును సక్సెస్ చేయాలి

సిబ్బందితో వైద్యుల సమీక్ష



యాచారం: సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

యాచారం: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైద్యులు ప్రియాంక, మౌనిక తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం కంటివెలుగు నిర్వాహణపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కంటి వెలుగు పథకంలో పరీక్షలు నిర్వహించే తీరు, సిబ్బంది, యంత్రాల పనితీరుపై సమీక్షించారు. అనంతరం వైద్య సిబ్బంది ఎంపీపీ కొప్పు సుకన్యను కలిసి కంటి వెలుగు పథకంపై వివరించారు. కంటి వెలుగు పథకం పర్యవేక్షకుడు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కంటివెలుగు..

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో గురువారం నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కమిషనర్ సత్యనారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని 1వ వార్డులో చేపట్టనున్నట్లు పేర్కొన్న ఆయన పాలకవర్గసభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

విజయవంతం చేద్దాం..

మాడ్గుల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 2018లో ప్రారంభించిన మొదటి విడత కంటి వెలుగుతో ఎంతోమందికి లబ్ధి చేకూరిందన్నారు. రెండో విడతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకులు సుభాష్, సతీష్ తదితరులు ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి నిరంతరం కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు

కందుకూరు: రైతుల అభ్యున్నతి, సొసైటీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సొసైటీ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాచులూరు, గుమ్మడవెల్లి, నేదునూరుల్లో ఒక్కో గోదాం నిర్మాణానికి రూ. 38 లక్షల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. దీర్ఘకాలిక అప్పులు తీసుకున్న రైతులు జనవరి చివరి నాటికి వాయిదాలు చెల్లించాలని, లేనిపక్షంలో అపరాధ రుసుం విధించాల్సి వస్తుందన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీ చెల్లించి అసలు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, నర్సింహ, పర్వతాలు, అంజమ్మ, వెంకటేష్, యశోద, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు దేవేందర్‌నగర్ కాలనీలో కౌన్సిలర్ బోధ యాదగిరిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం పహాడీషరీఫ్ సీఐ కిరణ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపులో ఉంటాయన్నారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కౌన్సిలర్‌ను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, మున్సిపల్ చైర్మన్ కే మధుమోహన్, కౌన్సిలర్, నాయకులు బోధ యాదగిరిరెడ్డి, వైశివకుమార్, బాకి విలాస్, సుధాకర్ శర్మ, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ఆమనగల్లు: ట్రోఫీ అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి తదితరులు



ఇబ్రహీంపట్నం రూరల్: బహుమతులు అందజేస్తున్న అతిథులు

- బహుమతుల ప్రదానోత్సవంలో అతిథులు
- పల్లెల్లో ముగిసిన క్రీడా పోటీలు

కడ్తాల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ నిర్మల కాశీనాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ వినోద్, ఫౌండేషన్ సభ్యులు యాదగిరి, రాఘవేందర్, లింగం, నాయకులు మధు, నరేశ్ పాల్గొన్నారు.

ముగిసిన పోటీలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. విజేత జట్లకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్, బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, శ్రీరాం, భాను, మణికంఠ, మల్లేష్, జంగయ్య, యాదయ్య, వెంకటేశు, రాములు తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్, లింగరావుపల్లిలో..

గెలుపోటములను సమాన దృష్టితో చూడాలని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్, లింగరావుపల్లిలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. వరప్రసాద్‌రెడ్డి విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, రంగారెడ్డి, తాహేర్, నరసింహ, శ్రీను, ఫౌండేషన్ సభ్యుడు రాఘవేందర్, విజయ్, మల్లయ్య, శివ, యాదయ్య, చంద్రయ్య, ఆర్గనైజర్స్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

మాడ్గుల: ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్–4 మంగళవారంతో ముగిశాయి.. ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు.శ్రీధర్, రమేశ్, రామచందర్, లక్ష్మణ్, జగదీష్, రాములు, చంద్రు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడోత్సవాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లిలో టీఆర్‌ఎస్, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, కబడ్డీ, వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. విజేతలకు సర్పంచ్ ఆండాలు, ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ బహుమతులు అందజేశారు. కప్పపహాడ్ గ్రామంలో కూడా డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నెగ్గినవారికి బహుమతులు అందజేశారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

- మహేశ్వరం గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం
- మంత్రి సబితారెడ్డి



బడంగ్‌పేట్: బాలాపూర్‌లో పర్యటిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

మహేశ్వరం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, మహేశ్వరం గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మైలార్ బాయి తండాకు చెందిన 40 మంది బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వీరానాయక్ అధ్యక్షతన మంత్రి సమక్షంలో ఆమె నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే బీజేపీ నాయకులు అడ్డుకొని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఉప్పుగడ్డ తండా సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో సంత్ సేవాలాల్ మహరాజ్, దుర్గమ్మ ఆలయాలు, బంజార భవన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మునావత్ రవినాయక్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బాలాపూర్ చెరువు సుందరీకరణ

బడంగ్‌పేట్: బాలాపూర్ పెద్ద చెరువును అతి సుందరంగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న సుందరీకరణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ కోసం రూ.3.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎవరు కూడా పర్మినెంట్‌గా ప్రహరీలు, గోడలు, హద్దులు ఏర్పాటు చేయవద్దని కోరారు. బాలాపూర్ వాసులకు ప్రకృతి ఆనందాన్ని చెరువు కట్టపై కల్పించేందుకే సుందరీకరణ పనులు చేపట్టామని తెలిపారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు చెరువు కట్టపై అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు, పోచమ్మకుంట చెరువు, అలాగే మీర్‌పేట్ కార్పొరేషన్‌లోనిసంజ చెరువు, మంత్రాల చెరువు, కుర్మల్‌గూడ,గుర్రంగూడ చెరువులకు కోట్ల రూపాయల నిధులు వెచ్చించామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు అర్జున్, పవన్ పాల్గొన్నారు.